క్లుప్తంగా

వెంగళాయపాలెం డొంక రోడ్డుకు మహర్దశ



గుంటూరు రూరల్: వెంగళాయపాలెం డొంక రోడ్డకు మహర్దశ కలిగింది. గ్రామ రైతులు పంట భూములకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. సమస్యను స్థానిక నేతలు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత దృష్టికి తీసుకెళ్లగా స్పందించిన ఆమె సంబంధిత అధికారులతో మాట్లాడి రూ. 6 లక్షల మంజూరు చేయించారు. ఈ నిధులతో బుధవారం రోడ్డు నిర్మాణ పనులు జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు పర్యవేక్షణలో ప్రారంభమయ్యాయి. పనుల్ని మండల పరిషత్ కోఆప్షన్ సభ్యుడు కరిముల్లా తదితరులు పర్యవేక్షించారు.

సాయిబాబా మందిరంలో ప్రత్యేక పూజలు

పొన్నూరు(చేబ్రోలు): మండలంలోని గాయం వారిపాలెంలో గల షిర్డీ సాయిబాబా మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు జరిగాయి. మందిర పదో వార్షికోత్సవం సందర్భంగా బాబాకు పంచామృత అభిషేకాలు, విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో అగస్త్యేశ్వరస్వామి కల్యాణం

గుంటూరు రూరల్: నల్లపాడులోని శ్రీ అగస్త్యేశ్వరాలయంలో స్వామి కల్యాణ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. గత నాలుగు రోజులుగా జరుగుతున్న ఉత్సవాల్లో చివరి రోజు బుధవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు, అభిషేకాలు, బలిహరణ, పూర్ణాహుతి, కోట్నోత్సవం, చూర్ణోత్సవం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన వసంతోత్సవంలో గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ఆలయ ఆవరణలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి సాయివిశ్వనాథ్, అర్చకుడు పవన్‌కుమార్‌శర్మ పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



గుంటూరు రూరల్: తండ్రి మందలించాడని ఇంట్లోంచి యువకుడు వెళ్లిపోయిన సంఘటనపై బుధవారం నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. హౌసింగ్ బోర్డ్ కాలనీకి చెందిన అవులమంద నారాయణ కుమారుడు మల్లికార్జున్ తాపీ పని చేస్తుంటాడు. గత కొద్ది రోజులుగా పనికి వెళ్లకుండా ఇంటి దగ్గరే ఉండటంతో నారాయణ మందలించాడు.దీంతో ఈ నెల 6న మల్లికార్జున్ ఇంట్లోంచి వెళ్లిపోయాడు. బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో నారాయణ పోలీసుల్ని ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సత్కారం



పాత గుంటూరు: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బృందావన్ గార్డెన్స్‌లో నగేష్ మిత్రమండలి ఆధ్వర్యంలో బుధవారం ఐదుగురు మున్సిపల్ పారిశుద్ధ్య మహిళా కార్మికుల్ని సత్కరించారు. కార్యక్రమంలో మండలి వ్యవస్థాపకులు నగేష్ ఖన్నా, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ సాంబశివరావు, ఆదినారాయణ రావు, గురవారెడ్డి, కాల్వపల్లి సాంబిరెడ్డి, పోరూరి సత్యనారాయణ ప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా పుష్పయాగం


పాత గుంటూరు: బృందావన్ గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో లక్ష్మీ జయంతి సందర్భంగా బుధవారం శ్రీపద్మావతి అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన పూజారి మాధవస్వామి ఆధ్వర్యంలో అమ్మవారిని విశేషంగా అలంకరించారు. పలు రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో వేదమంత్రాల నడుమ అంగరంగ వైభవంగా పుష్పాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో బొల్లేపల్లి సత్యనారాయణ లలితాంబ దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాన్ని నిశ్చల్ నరసింహం, సిమ్రాన్‌కౌర్ దంపతుల సౌజన్యంతో నిర్వహించారు.

ఘనంగా తిరుపతమ్మ తిరునాళ్ల మహోత్సవాలు

పాత గుంటూరు: కొరిటెపాడు ఆంజనేయపేటలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ, గోపయ్యస్వామి తిరునాళ్ల మహోత్సవాల్ని ఆలయ నిర్వాహకులు కన్నసాని విజయకుమార్ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం ఉత్సవమూర్తులకు గణపతి పూజ, గణపతి హోమం , పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలు, పసుపు కుంకుమ, విభూదితో విశేష అభిషేకాలు జరిపారు. ఈ సందర్భంగా అను డాన్స్ అకాడమీ విద్యార్థుల కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమాల్ని రవికుమార్, బాజీ పర్యవేక్షించారు.

ఆధునిక జీవనశైలితో ముంచుకొస్తున్న ముప్పు

- నేడు వరల్డ్ కిడ్నీ డే
- పెరుగుతున్న కిడ్నీ జబ్బుల కేసులు
- ప్రాథమిక దశలోనే గుర్తిస్తే పూర్తిగా నయం
- రోగులకు అందుబాటులో ఆధునిక వైద్యసేవలు



గుంటూరు మెడికల్: శరీరంలో కిడ్నీలు కీలకపాత్ర పోషిస్తాయి. చిక్కుడు గింజ ఆకారంలో ఉండే ఇవి నిరంతరం రక్తాన్ని పరిశుభ్రం చేస్తుంటాయి. ఒక్క రోజులోనే సుమారు 200 లీటర్లను వడకట్టి రక్తపోటు నియంత్రణతో పాటు ఒంట్లో నీరు, లవణాల సమతుల్యత దెబ్బతినకుండా కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తాయి. నేటి మనిషి ఆధునిక జీవనశైలిలో కిడ్నీ బాధితుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా ప్రజలు కిడ్నీ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించేందుకు 2006 నుంచి ప్రతి ఏడాది మార్చి రెండో గురువారం వరల్డ్ కిడ్నీ డేని నిర్వహిస్తున్నారు. ఈనెల 9న వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా 'సాక్షి' అందిస్తున్న ప్రత్యేక కథనం.

బాధితులు అధికమే...

ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కిడ్నీ ఫౌండేషన్ నివేదిక ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి 10 మందిలో ఒకరు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. మన దేశంలో 10లక్షల మందిలో 800 మంది కేవలం షుగర్ వల్ల కిడ్నీ జబ్బులకు గురవుతున్నారు. జిల్లాలో 20 మంది వైద్య నిపుణులు ఉన్నారు. ఒక్కో వైద్యుడి వద్ద ప్రతిరోజూ 30 నుంచి 40 మంది కిడ్నీ సమస్యలతో చికిత్స పొందుతున్నారు. చిన్న పిల్లల్లో సైతం జబ్బులు రావడంపై నెఫ్రాలజిస్టులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కిడ్నీ వ్యాధి లక్షణాలు

- వ్యాధి సోకినవారిలో ముఖం, కాళ్లవాపులు కనిపిస్తాయి
- ఆయాసం, అలసటగా ఉంటుంది.
- పనిమీద ఏకాగ్రత తగ్గడంతో పాటు ఆకలి మందగిస్తుంది.
- మూత్రం రాత్రివేళల్లో ఎక్కువసార్లు రావటం, కొన్ని సందర్భాల్లో సరిగా రాకపోవడంతో పాటు రక్తం కారుతుంది.
- మూత్రం పోసేటప్పుడు దీర్ఘకాలంగా చురుకు, మంట

హైరిస్క్ వారు జాగ్రత్తగా ఉండాలి

బీపీ, షుగర్ ఉన్నవాళ్లు హైరిస్క్ గ్రూప్‌కు చెందిన వారు. వీరి కిడ్నీ జబ్బుల బారిన పడే అవకాశం చాలా ఎక్కువగా ఉంది. షుగర్ సోకిన ఏడు నుంచి పదేళ్లలో కిడ్నీలు పాడయ్యే అవకాశం ఎక్కువ. అధిక బరువు ఉన్నవారు సైతం జబ్బున పడే ప్రమాదం ఉంది. జీవనశైలిలో వచ్చిన మార్పుల వల్ల నేడు 20 ఏళ్లు దాటిన ప్రతి 10 మందిలో ఒకరు బారిన పడుతున్నారు. షుగర్, అధికరక్తపోటు, ఊబకాయం దీనికి కారణం. బీపీ, షుగర్ ఉన్నవాళ్లు తప్పనిసరిగా కిడ్నీ పరీక్షలు చేయించుకోవాలి. వయస్సు మీద పడేకొద్దీ సహజంగా మూత్ర సంబంధిత సమస్యలు వస్తాయి. వాటిని సకాలంలో గుర్తించకపోతే కిడ్నీలు పాడయ్యే ప్రమాదం ఉంది.

వ్యాధి బారిన పడకుండా జాగ్రత్త అవసరం



క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. రక్తంలో చక్కెర శాతాన్ని , అధిక రక్తపోటులను నియంత్రణలో ఉంచుకోవాలి. ఆరోగ్య కరమైన ఆహార నియమాలు పాటించాలి. అధిక బరువును తగ్గించుకోవాలి. డాక్టర్ పర్యవేక్షణ లేకుండా ఇష్టం వచ్చినరీతిలో మందులు వాడకూడదు. పొగ, మద్యం తాగడంలాంటి దురలవాట్లకు దూరంగా ఉండాలి. పరిమితమైన ఆహారం, ఉప్పు తగ్గించి వాడటంతో పాటు ఎక్కువగా నీటిని తాగాలి.

– డాక్టర్ అన్నపురెడ్డి శివనాగేంద్రరెడ్డి, సీనియర్ నెఫ్రాలజిస్ట్, గుంటూరు

అందుబాటులో ఆధునిక వైద్యం



బ్లడ్ గ్రూప్ మ్యాచ్ కాకపోయినా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేసే ఆధునిక వైద్యసేవలు నేడు అందుబాటులో ఉన్నాయి. మిస్ మ్యాచ్ కిడ్నీ బాధితులు పలువురికి విజయవంతంగా ఆపరేషన్లు చేశాం. జీవనధాన్ పథకం ద్వారా కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేస్తున్నాం. డయాలసిస్ చేయించుకునేవారికి కిడ్నీ మార్పిడి ఆపరేషన్ చేస్తే ఎంతో ఉపయోగంతో పాటు జీవితకాలం 20 ఏళ్ల వరకు పొడిగించవచ్చు.

–డాక్టర్ చింతా రామకృష్ణ, కిడ్నీ మార్పిడి వైద్య నిపుణులు, గుంటూరు

జీజీహెచ్‌లో ఉచిత వైద్యసేవలు



గుంటూరు జీజీహెచ్‌లో ప్రతిరోజూ కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చేవారి సంఖ్య 100 నుంచి 150 వరకు ఉంటుంది. వీరే కాకుండా ప్రతి రోజూ 40 మందికి పైగా రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు. పాజిటివ్ కేసులకు కూడా డయాలసిస్ చేసే సౌకర్యం ఉంది. ఆస్పత్రిలో 24 గంటలూ డయాలసిస్ వైద్యసేవలు జరుగుతూనే ఉంటాయి.

– డాక్టర్ మొహమ్మద్ అస్లాం, నెఫ్రాలజిస్ట్, జీజీహెచ్ గుంటూరు

సంజీవయ్యనగర్ రైల్వే గేట్ ఓపెన్

- బుధవారం ఉదయం నుంచి యథావిధిగా రాకపోకలు



నెహ్రూనగర్: స్థానిక వాటర్ ట్యాంకుల నుంచి హెచ్ఎల్ఆర్(లక్ష్మీపురం) వాటర్ ట్యాంకులకు ఇంటర్ కనెక్షన్ పనుల నిమిత్తం ఫిబ్రవరి 21 నుంచి మూసివేసిన సంజీవయ్యనగర్ రైల్వే గేటును మంగళవారం వరకు తీయలేదు. దీంతో గత 15 రోజుల నుంచి సంజీవయ్యనగర్, రాజీవ్‌గాంధీనగర్, రెడ్డిపాలెం నుంచి నెహ్రూనగర్ మీదుగా కొత్తపేటకు రాకపోకలు సాగించే వాహనదారులు డొంకరోడ్డు మీదుగా వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంటర్ కనెక్షన్ పనులు పూర్తయినప్పటికీ చిన్న చిన్న పనుల కోసం ఇంజినీరింగ్ అధికారులు గుంతలు పూడ్చి వేయకుండా, గేటు ఓపెన్ చేయనియకుండా అలాగే వదిలేశారు. దీంతో ప్రజలు పడుతున్న ఇబ్బందుల్ని 'సాక్షి' కమిషనర్ దృష్టికి ఫోన్ ద్వారా తెలియజేసింది. స్పందించిన కమిషనర్ యుద్ధప్రాతిపదికన రైల్వే గేటు వద్ద గుంతల్ని పూడ్చి వేయాలని ఆదేశాలివ్వడంతో ఇంజినీరింగ్ అధికారులు మంగళవారం రాత్రి నుంచి పనులు ప్రారంభించారు. బుధవారం తెల్లవారుజామున రోడ్డును పునరుద్ధరించారు. దీంతో ఉదయం నుంచి రైల్వే గేటు ఓపెన్ ఆవ్వడంతో వాహనదారులు ఊపిరి పీల్చుకున్నారు.

సమాజ అభివృద్ధిలో స్త్రీ పాత్ర ఉన్నతం

ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంటు అన్నపూర్ణ



మహిళా దినోత్సవంలో రెడ్డి సంఘం నాయకులు

గుంటూరు రూరల్: మహిళలు నేడు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ఏపీ రెడ్డి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆయన మాట్లాడారు. సమాజం అభివృద్ధిలో స్త్రీ పాత్ర ఎంతో ముఖ్యమైందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారులు అన్నపురెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇంటూరి సాంబశివారెడ్డి, కార్యాలయం ఇంచార్జ్ కె. రామకృష్ణారెడ్డి, సెక్రటరీ సీహెచ్. కృష్ణారెడ్డి, రాష్ట్ర మహిళా కార్యదర్శి శ్రీరెడ్డి, జిల్లా అధ్యక్షురాలు బి. విజయలక్ష్మి, జిల్లా కార్యదర్శి లక్ష్మి, రమాదేవి పాల్గొన్నారు.

ఉన్నత వ్యక్తిత్వం స్త్రీ తత్వం

గుంటూరు రూరల్: ఉన్నత వ్యక్తిత్వం స్త్రీ తత్వమని ప్రముఖ గైనకాలజిస్ట్ ఎం. ప్రతిమ తెలిపారు. నగర శివారు లాం నందున్న చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్రహ్మ సృష్టిలో స్త్రీ పాత్ర ఎంతో ముఖ్యమైందన్నారు. సృష్టికి మూలం ఆమేనని, అందుకే స్త్రీని ప్రకృతిగా అభివర్ణిస్తారని వివరించారు. ఇంటర్‌నేషనల్ వెయిట్‌లిఫ్టర్ సాయిరేవతి మాట్లాడుతూ స్త్రీని పూజనీయ భావంతో చూడాలని చెప్పారు. చలపతి ఎడ్యుకేషనల్ సొసైటీ కోశాధికారి వై. అనంతకుమారి మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని ప్రపంచానికి దీటుగా ముందుకు సాగిపోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థినులకు వివిధ ,పోటీల్ని నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.చంద్రశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ కె. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

చేబ్రోలు: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంటు ఎస్. అన్నపూర్ణ సూచించారు. చేబ్రోలు ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అన్నపూర్ణ మాట్లాడుతూ విద్యార్థినులంతా ఉన్నత స్థాయిలో ఉన్న మహిళల్ని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. అనంతరం కళాశాల యాజమాన్యం వివిధ అంశాల్లో విద్యార్థినులకు పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ప్రత్తిపాడు ఎస్‌హెచ్‌వో గీత, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యలోనూ రాణించాలి

పెదకాకాని: స్థానిక లూథర్‌గిరి కాలనీ గ్రంథాలయంలో బుధవారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రంథాలయాధికారి వేముల విజయకుమార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా పంచాయతీ సర్పంచ్ గోళ్ల స్వరూపరాణి పాల్గొన్నారు. విద్యలోనూ రాణించి సమాజం గౌరవప్రదమైన స్థానానికి మహిళలు ఎదగాలని ఆమె సూచించారు. అనంతరం ఆమెతో పాటు గ్రంథాలయ స్వీపర్ సంపూర్ణలక్ష్మిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు షేక్ షహనాజ్, మాతంగి నిర్మల పాల్గొన్నారు.

ఐద్వా, సీఐటీయూం మహిళల ప్రదర్శన

పెదకాకాని: మహిళలపై దాడులకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలని ఐద్వా కార్యదర్శి జె రాజ్యలక్ష్మి కోరారు. పెదకాకాని గ్రామంలో ఐద్వా, సీఐటీయు ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా కార్యదర్శి జె. రాజ్యలక్ష్మి మాట్లాడుతూ సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కోరారు. మహిళలపై దాడుల్ని అరికట్టాలని, కేసుల్లో నిందితుల్ని కఠినంగా శిక్షించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమస్యలు వచ్చినపుడు మహిళలు ధైర్యంగా నిలబడి ఎదుర్కొని పోరాడాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకులు నన్నపనేని శివాజీ, ఐద్వా నాయకులు షేక్ మరింబ, షేక్ రహీమ, షేక్ మీరాబి, ఎం. సరోజిని, ఎం. మల్లేశ్వరి, ఆర్. మల్లేశ్వరి, వెంకటరమణ పాల్గొన్నారు.

మహిళల ఆర్థికాభివృద్ధే వైఎస్సార్ క్రాంతి పథం లక్ష్యం

కాకుమాను:ప్రతి మహిళా ఆర్థికంగా అభివృద్ధి చెందడమే వైఎస్సార్ క్రాంతి పథం లక్ష్యమని ఏపీఎం సోమశేఖర్ తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో బుధవారం డ్వాక్రా మహిళల్ని సన్మానించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ మహిళలంతా స్వశక్తితో ఆర్థికంగా అభివృద్ధి చెందాలని సూచించారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు అనేక పథకాల ద్వారా లబ్ధి చేకూరుస్తోందని, వాటిని సద్వినియోగం చేసుకుని భవిష్యత్‌లో ఆర్థికంగా ఎదగాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సీసీలు రాఘవులు, సుబ్బారావు పాల్గొన్నారు.



పెదకాకాని గ్రంథాలయంలో సర్పంచి స్వరూపరాణి, స్వీపర్ సంపూర్ణలక్ష్మికి సన్మానం



చలపతి ఇంజినీరింగ్ కళాశాలలో వేడుకల్లో పాల్గొన్న మహిళామణులు



డ్వాక్రా మహిళలను సన్మానిస్తున్న ఏపీఎం సోమశేఖర్ తదితరులు

జిల్లాస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీలు ప్రారంభం

గుంటూరు వెస్ట్ (క్రీడలు): క్రీడల్ని ప్రోత్సహించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి రెండు శాతం రిజర్వేషన్లు కల్పించారని తూర్పు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ నాయకురాలు షేక్ నూరి ఫాతిమా తెలిపారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బీఆర్ స్టేడియంలో 9వ జిల్లాస్థాయి సీనియర్ ఫెన్సింగ్ పోటీల్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల వల్ల మహిళల్లో ఆత్మస్థైర్యం పెరుగుతుందని తెలిపారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ కార్యదర్శి అశోక్‌బాబు మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా సుమారు 50 మంది పాల్గొన్నారన్నారు. విజేతలు ఈ నెల 10, 11 తేదీల్లో కాకినాడలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ డి.ఎస్. క్రిష్టోఫర్, అధ్యక్షుడు ఎ.సత్యనారాయణ, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీతిరుపతమ్మ తల్లి ఊరేగింపు

పాత గుంటూరు: లక్ష్మీతిరుపతమ్మ తల్లి చల్లని దీవెనలు అందించాలని శాసనమండలి సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. శ్రీనివాసరావుపేటలోని లక్ష్మీతిరుపతమ్మ తల్లి 28వ వార్షిక మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి, స్థానిక కార్పొరేటర్ గేదెల నాగ రంగమణి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపకాంతుల నడుమ, కనకతప్పెట్లతో అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు ఆళ్ల శ్రీను, ఆళ్ల హరి, నాగమ్మ శ్రీను, అబ్బిశెట్టి రంగా, రామకృష్ణ, పగడాల రామకృష్ణ, జె.రామారావు పాల్గొన్నారు.

రైతు పండించిన పంటలకు గిట్టుబాటు ధర

ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య



కొత్తరెడ్డిపాలెం చెన్నారెడ్డికాలనీలో చేనేత కార్మికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

చేబ్రోలు: అన్నదాతల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పంటలకు గిట్టుబాటు ధర కల్పించినట్లు పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య తెలిపారు. చేబ్రోలు–5 గ్రామ సచివాలయ పరిధిలో బుధవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పర్యటించారు. ప్రతి గడపకు వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరు గురించి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా డ్రెయిన్లు, రోడ్ల సమస్యల్ని స్థానికులు తెలియజేయడంతో వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గ్రామ సచివాలయాలకు మంజూరైన నిధులతో పాటు ప్రత్యేక నిధులతో గ్రామాభివృద్ధి చేస్తామని తెలిపారు. స్థానికంగా తెలియజేసిన కొన్ని సమస్యల్ని అక్కడిక్కడే పరిష్కరించారు. ఈ సందర్భంగా 765 గృహాల్ని పర్యటించి వారికి ప్రభుత్వ లబ్ధిని తెలియజేశారు. చెన్నారెడ్డి కాలనీలో చేనేత కార్మికుల్ని కలిసి వారి సమస్యల్ని తెలుసుకున్నారు. నూలు వడకటం, ముడి సరుకు, ఆదాయం గురించి వారితో మాట్లాడారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి చేనేత కార్మికుల సంక్షేమం కోసం కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. నేతన్నలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సెంటర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో పారదర్శక పాలన నడుస్తోందన్నారు.సంక్షేమ పథకాల ద్వారా అందించే డబ్బులు దుర్వినియోగం కాకుండా ఉండటం కోసం లబ్ధిదారుల అకౌంట్‌లో ఆన్‌లైన్ ద్వారా జమ చేస్తున్నట్లు తెలిపారు. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇచ్చి నిధులు కేటాయిస్తోందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అత్తోట వినీతారాణి, పి. శ్రీనివాసరావు, గాదె కేశవరెడ్డి, జి. శ్రీరెడ్డి, ఆర్. శ్రీదేవి, బి. పుల్లారెడ్డి, ఆదాం, జి. వెంకట సుబ్బయ్య, బి.అప్పిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్‌పై ఫిర్యాదులను తక్షణం పరిష్కరించండి

సిబ్బందికి మేయర్ కావటి సూచన



ఎలక్ట్రిసిటీ స్టాక్ పాయింట్‌లో వస్తువులను పరిశీలిస్తున్న మేయర్ కావటి

నెహ్రూనగర్: విద్యుత్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని నగర మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. నాజ్ సెంటర్ లోని ఎల్ఎల్ఆర్ రిజర్వాయర్ వద్ద నగర పాలక సంస్థ ఎలక్ట్రికల్ విభాగానికి సంబంధించిన స్టాక్ పాయింట్ (వీధి దీపాల విడిభాగాలు)ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు, ప్రజావసరాల దృష్ట్యా అవసరమైన ప్రాంతాల్లో వీధి దీపాల్ని ఏర్పాటు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ప్రజల వద్ద నుంచి వచ్చే ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వహిస్తే సహించేది లేదని, చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని ప్రజాప్రతినిధుల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. వాటిని సత్వరం పరిష్కరించడానికి గానూ తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలకు వేర్వేరుగా ఏఈలను నియమించినట్లు చెప్పారు.

10న దర్పణం పుస్తకావిష్కరణ



సమావేశంలో మాట్లాడుతున్న తాండవకృష్ణ

పాత గుంటూరు: శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 10న గుంటూరు కళాపరిషత్ రజతోత్సవ ప్రత్యేక సంచిక దర్పణం పుస్తకావిష్కరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వల్లూరు తాండవకృష్ణ, బి. పూర్ణ, తెలిపారు. విజ్ఞాన మందిరంలో బుధవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. సాయంత్రం 6 గంటలకు జరిగే కార్యక్రమంలో పుస్తకావిష్కరణ అనంతరం పాకుడురాళ్లు నాటక ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. కళాభిమానులు పాల్గొనాలని ఆయన కోరారు. సమావేశంలో ఉపాధ్యక్షులు పి.వి. మల్లికార్జునరావు, నాయుడు గోపి పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

పాత గుంటూరు: అరండల్‌పేట నాలుగో లైనులోని శ్రీ అష్టలక్ష్మీ సమేత లక్ష్మీ నారాయణస్వామి దేవస్థానం వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం వేద మంత్రాలతో శ్రీ వల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి కల్యాణం నిర్వహించారు. ఆలయ ప్రధానాచార్యులు మర్రిపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీచక్ర అభిషేకాలు, నిత్య పూజలు, కల్యాణంలో విశేష పూజల్ని జరిపారు. కల్యాణమూర్తులకు వివిధ రకాల పుష్పాలు, సుగంధ ద్రవ్యాలతో పుష్పాభిషేకం నిర్వహించారు. మహా హారతి, మంత్రపుష్పం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

కుటుంబ వ్యవస్థను కాపాడేది మహిళలే..

బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ

కొరిటెపాడు(గుంటూరు): భారత సమాజం రక్షించబడుతుందంటే కారణం కుటుంబ వ్యవస్థ అని, దానికి ఆలంబనగా వ్యవహరించేది మహిళలే అని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ అన్నారు. స్థానిక పట్టాభిపురంలోని బజరంగ్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలకు నూతన వస్త్రాలను బహూకరించారు.ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ ఎందరో మహిళలు దేశ నాయకులుగా చరిత్ర సృష్టిస్తూ, జాతి దశను, దిశను మార్చేస్తున్నారని వెల్లడించారు. బజరంగ్ ఫౌండేషన్ మహిళా ఆరోగ్య పరిరక్షణలో భాగంగా నారీ రుతువు కార్యక్రమం అమలు చేస్తున్నామని తెలిపారు. అనంతరం సంస్థ కార్యాలయం, ఫౌండేషన్లలో పనిచేస్తున్న ఉద్యోగినులు, కార్మికుల్ని సత్కరించారు. బజరంగ్ డైరెక్టర్లు సిద్ధినేని శ్రీనివాసరావు, ఎస్.సమీర్‌నందన్, జి.సుబ్బారావు పాల్గొన్నారు.

12న ముత్తాయపాలెంలో కళ్లజోళ్ల పంపిణీ

కొరిటెపాడు(గుంటూరు): 'జగనన్నామ సంక్షేమ సంవత్సరం' కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6న బాపట్ల నియోజకవర్గంలోని ముత్తాయపాలెంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య పరీక్ష శిబిరంలో కళ్లజోళ్లు అవసరమైన వారికి యుద్ధప్రాతిపదిన వాటిని సిద్ధం చేయిస్తున్నామని బజరంగ్ ఫౌండేషన్ సీఈఓ అంబటి మురళీకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరు రోజుల వ్యవధిలోనే 507 మంది పేదలు, మత్స్యకారులకు కళ్లజోళ్ల పంపిణీని ఈనెల 12న (ఆదివారం) సాయంత్రం 3.30 గంటలకు ముత్తాయపాలెంలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. కళ్లజోళ్లకు ఎంపికైన వారందరూ ఆ రోజు గ్రామంలోని శ్రీఆంజనేయస్వామి బొమ్మ వద్దకు వచ్చి తీసుకోవాలని ఆయన సూచించారు.



